## క్లుప్తంగా

### ఉచిత పశువైద్య శిబిరం

మధిర: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వైరా, పశు సంవర్ధక శాఖ ఖమ్మం వారి ఆధ్వర్యంలో రాయపట్నంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారిణి డాక్టర్ ఉమా కుమారి గర్భకోశ వ్యాధులు, చూడి పరీక్షలు, ఎదకురాని పద్దలకు, వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు చేసి చికిత్స నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లేగ దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. శిబిరంలో మధిర యూనిట్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

### ముదిగొండ ఎస్సైగా కృష్ణప్రసాద్

ముదిగొండ: ముదిగొండ ఎస్సై–2గా కృష్ణప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ సీసీఎస్ నుంచి బదిలీపై ఆయన ముదిగొండకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ మురళిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

### బ్రిలియంట్ ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి: ఇండియన్ ఒలంపియాడ్ నిర్వహించిన పోటీ పరీక్షల్లో సత్తుపల్లి వీవీ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. పెయింటింగ్ విభాగంలో ఆర్.హాసిని జిల్లా టాపర్‌గా నిలవగా, జీకే విభాగంలో ఎ.ద్రాక్షాయని స్టేట్ టాపర్‌గా నిలిచింది. పోటీల్లో గెలుపొందిన వారికి సైకాలజిస్ట్ స్వచ్ఛ నగేష్, తెలుగు సినీ నటుడు ఘర్షణ శ్రీనివాస్ బహుమతులు అందించారు. దీంతో విద్యార్థులను ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, కరస్పాండెంట్ భగవాన్‌రెడ్డి అభినందించారు.

### రాయితీని సద్వినియోగం చేసుకోండి

బోనకల్: ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు 20శాతం రాయితీని ప్రకటించిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పున్నం చందర్, వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ కోరారు. మండలంలోని రావినూతల గ్రామంలో శుక్రవారం ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణ్, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### రైల్వేగేట్‌ను పరిశీలించిన ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

మధిర: మధిరలోని రైల్వే గేట్ ప్రాంతాన్ని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వేగేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతపై నాయకులు, స్థానికులతో చర్చించారు. హాల్టింగ్ విషయమై రైల్వే శాఖ మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

### విద్యార్థుల క్షేత్ర సందర్శన

మధిర: మధిర హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శుక్రవారం మధిర వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు. మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణి దేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పంట మార్పిడి ఆవశ్యకత గురించి వివరించారు. శాస్త్రవేత్త నాగస్వాతి మాట్లాడుతూ.. వరి పంట మార్పిడి, మధిర గ్రీన్ గ్రామ్ ఎంజిజి 295 రకం గురించి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయశ్రీ, జ్యోతి, షేక్ నాగూర్ వలీ, రాజ్యలక్ష్మి, శంషాద్, సమత పాల్గొన్నారు.

### బీమా చెక్కు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడుకు చెందిన పీఆర్‌టీయూ సంఘం నాయకుడు, ఉపాధ్యాయుడు మర్రి భూమయ్య ఇటీవల మృతి చెందారు. సంఘంలో సభ్యత్వం ఉండడంతో మరణించిన ఆయనకు రూ.లక్ష బీమా మంజూరైంది. ఆ నగదును బాధిత కుటుంబానికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రంగారావులు అందించారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్ రెడ్డి, బాబురావు నాయకులు పాల్గొన్నారు.

### ప్రజా ఆరోగ్యంపై నిర్లక్ష్యం

మధిర: ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆరోపించారు. శుక్రవారం మధిర పట్టణంలో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఆస్పత్రి నిర్మాణం పూర్తిఅయినా ఇప్పటివరకు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు.

### జేవీఆర్ కళాశాలలో జ్ఞాన దత్తత కార్యక్రమం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వ జేవీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జ్ఞాన దత్తత కార్యక్రమం నిర్వహించగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి మాట్లాడారు. విద్యార్థులను దత్తత తీసుకొని వారికి విద్యాపరమైన సలహాలు, సూచనలు, శిక్షణ ఇవ్వటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

# ఆమె రాణిస్తోంది..



- అన్నిరంగాల్లోనూ అతివల పరుగులు
- పురుషులతో సమానంగా ముందుకు..
- ఇళ్లలోనూ ఆడపిల్లలపై తగ్గుతున్న వివక్ష

ఉద్యోగ, క్రీడా.. ఇతర అన్ని రంగాల్లోనూ గతంతో పోలిస్తే అతివలు రాణిస్తున్నారు. అందివచ్చే అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇళ్లలోనూ గతంతో పోలిస్తే అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను చదివిస్తుండడంతో వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తోంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు.. ఒకరు లేదా ఇద్దరు అమ్మాయిలు జన్మించినా వారి ఎదుగుదలకు చేయూతనిస్తున్న తల్లిదండ్రుల వివరాలతో కథనాలు...

### 30 ఏళ్లుగా కొలిమి పనుల్లో..



కొలిమి పని చేస్తున్న నాగమ్మ

వైరా: నిరుపేద కుటుంబం.. ఆపై కుటుంబ బాధ్యతలు వెరసి 30 ఏళ్లుగా కొలిమినే ఆధారంగా చేసుకుని జీవిస్తోంది ఆమె. ఏన్కూరులోని ఎన్నెస్పీ కాలువ గట్టు సమీపాన కొలిమి పనులు చేసే నాగమ్మ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె భర్త రాములు గత 30 ఏళ్ల క్రితం ఇదే పని చేసే క్రమాన మృతి చెందాడు. దీంతో ఇద్దరు కుమార్తెలు కృష్ణవేణి, మంగమ్మ, కుమారుడు సైదులును పోషించేందుకు కొలిమి పనినే ఎంచుకున్న నాగమ్మ ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లు చేసింది. ఇంతలోనే కృష్ణవేణి భర్త మృతి చెందడడం ఆమె ఇద్దరు పిల్లలనూ నాగమ్మే పోషిస్తుంది. మరో వైపు కుమారుడు సైదులు అండగా నిలుస్తుండడంతో ఈ పనికి తోడు ఆసరా పింఛన్ ద్వారా జీవనం వెళ్లదిస్తోంది. అయితే, ఎన్నెస్పీ కాల్వపై వేసుకున్న చిన్నపాటి ఇల్లు తప్ప ఇతర ఆస్తులు లేకున్నా కష్టాన్నే నమ్ముకున్న ఆమె ఎందరికో ఆదర్శంగా నిలుస్తుంది.

### చదువుతూ.. కరాటే నేర్పుతూ



సాధించిన పతకాలతో శైలజ

సత్తుపల్లిటౌన్: ఉన్నత చదువులు చదువుతూనే.. కరాటేపై ఉన్న ఆసక్తితో నేర్చుకున్న యువతి మరికొందరికి నేర్పిస్తోంది. సత్తుపల్లి ద్వారకాపురికాలనీకి చెందిన డోజర్ డ్రైవర్ నడ్డి నాగరాజు – నాగేశ్వరమ్మ కుమార్తె శైలజ కరాటే కుమిటీ విభాగంలో తానేంటో నిరూపిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణిస్తోంది. ప్రస్తుతం ఖమ్మంలో బీపీఈడీ చదువుతున్న ఆమె పదో తరగతి నుంచే మాస్టర్ పిచ్చయ్య వద్ద కరాటే శిక్షణ తీసుకుంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు శిక్షణ ఇచ్చే అవకాశం దక్కగా వేతనంతో శైలజ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. ఆమె పలు పోటీల్లో 40కి బంగారు పతకాలు సాధించడం విశేషం.

### నాడు క్రీడాకారిణి.. నేడు పీడీ



కబడ్డీ శిక్షణ ఇస్తున్న పీడీ గుగులోత్ దేవి

ముదిగొండ: పాఠశాల స్థాయి నుంచే ఆటల్లో ప్రతిభ చూపిన ఆమె ఇప్పుడు వ్యాయామ ఉపాధ్యాయునిగా రాణిస్తోంది. గుగులోతు దేవి చిన్నతనం నుంచే కబడ్డీలో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటింది. ఆతర్వాత భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం బేతంపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008లో పీఈటీగా బాధ్యతలు చేపట్టగా... సింగరేణి మండలం బాజుమల్లాయిగూడెం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సమయాన పీడీగా ఉద్యోగోన్నతి లభించింది. ప్రస్తుతం ముదిగొండ మండలం వల్లభి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న దేవి, విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో శిక్షణ ఇస్తుండగా పలువురు పతకాలు సాధించారు.

## ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు



కొణిజర్ల: లక్ష్మీపురంలో మహిళా సిబ్బందిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొణిజర్ల: తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఏ రజిత మహిళల గొప్పతనం గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు సాధించలేదని ఏదీ లేదని మగవాళ్లకు దీటుగా అన్ని రంగాలలో విజయం సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ వైస్ ప్రిన్సిపల్ బి రాజేశ్వరి, కోఆర్డినేటర్లు కే పీ ఐశ్వర్య, కె రజిని, మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

**లక్ష్మీపురం పీఎస్‌లో..**

మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్త చింతపల్లి సువార్త, ఆయా బానోత్ సుశీల, ఆశా వర్కర్ శ్రీలత, చిలకమ్మలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం షేక్ కరామత్‌అలీ, ఉపాధ్యాయుడు జయరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### బస్సు సర్వీసులు పెంచాలి

కారేపల్లి: ఉచిత బస్సు అంటూ.. సర్వీసులు పెంచకపోవడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గాంధీనగర్‌లో ఈసం లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. స్త్రీలపై అఘాయిత్యాలు జరగకుండా దోషులను కఠిన శిక్ష విధించాలన్నారు. ఐద్వా నాయకురాళ్లు నీలిమ, అచ్చమ్మ, సుజాత, జగ్గమ్మ పాల్గొన్నారు.

### మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

ముదిగొండ: మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని తహసీల్దార్ సునీత అన్నారు. శుక్రవారం నెహ్రూ యువకేంద్రం, ప్రజ్వల యువజనసంఘం సంయుక్త ఆధ్వర్యంలో ముదిగొండలోని స్త్రీశక్తి భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని.. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అదే విధంగా తహసీల్‌లో, బాణాపురం హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులను సన్మానించారు. నాయబ్ తహసీల్దార్ లక్ష్మి, ఆర్ఐలు ప్రసన్న, వహిదా పాల్గొన్నారు.

### ఆర్థికాభివృద్ధి సాధించాలి

తల్లాడ: సమాజంలో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని తల్లాడ ఎస్‌బీఐ మేనేజర్ ఎం.ఫణి కుమార్ అన్నారు. తల్లాడ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్, పీహెచ్‌సీ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మహిళలకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక రాణి, నంబూరి కనకదుర్గ, ఫీల్డ్ ఆఫీసర్ కె.శ్రీనివాస్, ఎకౌంటెంట్ బీమ్‌రాజ్, వైద్య సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# వకుళామాత ఒడిలో శ్రీవారి కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



శ్రీవారి కల్యాణాన్ని తిలకిస్తున్న మంత్రి తుమ్మల

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం ఆలయ ప్రాంగణంలో తుళ్లూరు కోటేశ్వరరావు – నిర్మల దంపతులు రూ.5కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీవకుళామాత స్టేడియంను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల శాంతి కల్యాణం నిర్వహించగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఈ మేరకు మంత్రి కల్యాణ పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. అనంతరం జమలాపురం ఆలయంలో స్వామిని మంత్రి, ఎంపీ దర్శించుకున్నారు. తొలుత ఉదయం 8గంటలకు జరిగిన స్టేడియం శిఖర ప్రతిష్ఠా కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వీరాస్వామి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు, ఆలయ ఈఓ జగన్మోహన్‌రావుతో పాటు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, చావా రామకృష్ణ, వేజండ్ల సాయికుమార్, ఎల్.వీ.నారాయణరెడ్డి, నన్నపనేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరుకు చేరిన గోదావరి జలాలు..




గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

కల్లూరురూరల్/సత్తుపల్లిరూరల్/కల్లూరు: సీతారామ సాగర్ ప్రాజెక్టు ద్వారా విడుదల చేసిన గోదావరి జలాలు కల్లూరుకు చేరాయి. ఈ సందర్భంగా ఎన్నెస్పీ కెనాల్ పరిధి కప్పలబంధం రెగ్యులేటర్ వద్ద శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి గోదావరి జలాలకు పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పట్టుదలతో జిల్లాకు గోదావరి జలాలు వచ్చాయని, తద్వారా సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాలు సస్యశ్యామలం అవుతాయని పేర్కొన్నారు. కాగా, కల్లూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సత్తుపల్లి మండలం కొత్తూరులో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాట్లాడారు. సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ల చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, భాగం నీరజాదేవి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీను, భాగం ప్రభాకర్‌చౌదరి, అక్కిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఆలకుంట నర్సింహారావు, మట్టా రామకృష్ణ, భూక్యా శివ, పరిమి భరత్, చల్లగుండ్ల కృష్ణయ్య, గొర్లమారి రామ్మోహన్‌రెడ్డి, తిరుమల రావు, చల్లగుళ్ల నర్సింహారావు పాల్గొన్నారు. కాగా, మహిళా దినోత్సవంలో భాగంగా గ్రామదీపికల సంఘం బాధ్యులు ఎమ్మెల్యే రాగమయి, కల్లూరు మార్కెట్ చైర్మన్ భాగం నీరజాదేవిని సన్మానించారు. సంఘం మండల అధ్యక్షురాలు వేము నాగమణితో పాటు కుమారి, నీలవేణి, కృష్ణవేణి, నాగమణి, రమా, షాహిదాబేగం పాల్గొన్నారు.

# స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో మాయాజాలం

- ఒకే క్లస్టర్‌లో రూ.54లక్షల మేర అవకతవకలు
- బయటపడిన సిబ్బంది అక్రమాలు, రూ.30 లక్షల రికవరీ



విచారణ చేస్తున్న ఏపీడీ నూరుద్దీన్, ఉద్యోగులు

కల్లూరు: పేద మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి పథకం ద్వారా 2011 నుంచి రుణాలు మంజూరు చేస్తుండగా కొందరు సిబ్బంది తీరుతో పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇదే తరహా ఘటన కల్లూరులో వెలుగు చూసింది. మండలంలో 1,593 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఉండగా, ప్రస్తుతానికి 1,251 గ్రూపులే కొనసాగుతున్నాయి. అంతేకాక ఉన్న సంఘాల సమావేశాలు సైతం సరిగ్గా నిర్వహించకుండా, రికార్డులు రాయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, జనవరి 9న కల్లూరుకు బదిలీపై వచ్చిన ఏపీఎం బీరవల్లి రాంబాబు 10వ తేదీన సమావేశం ఏర్పాటుచేయగా స్త్రీనిధి రుణాల చెల్లింపులో అవకతవకలు జరిగాయని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈమేరకు ఒకే క్లస్టర్‌లోని ముగ్గు వెంకటాపురం, పేరువంచ, చంద్రుపట్ల, నారాయణపురం, వెన్నవల్లిలో సీఆర్‌పీలతో ఆడిట్ చేయించగా వీఓఏలు వసూలు చేసిన, బ్యాంకులో చెల్లించిన స్త్రీనిధి రుణాల్లో రూ.54 లక్షలు తేడా బయటపడింది. ఒక క్లస్టర్‌లోనే ఇంత నగదు గోల్‌మాల్ అయిందంటే మిగతా ఆరు క్లస్టర్ల పరిస్థితి తేలాల్సిఉంది. కాగా, పక్కదారి పట్టిన నగదు వెంటనే రికవరీ చేయాలని నలుగురు సీసీలు, 11 మంది గ్రామ దీపికలకు నోటీసులు ఇవ్వగా.. వారు తప్పు ఒప్పుకుని రూ.30 లక్షల మేర తిరిగి చెల్లించారు. ఈక్రమంలో ఏపీఎం రాంబాబు సిబ్బందిని దుర్భాషలాడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై ఆయన స్పందిస్తూ రుణాల చెల్లింపులో సుమారు రూ.54 లక్షల తేడా ఉండడంతో సిబ్బందితో మాట్లాడి నగదు చెల్లించాలని సూచించానే తప్ప ఎలాంటి దుర్భాషలాడలేదని చెప్పారు.

**ఐకేపీ కార్యాలయంలో విచారణ..**

కల్లూరు ఐకేపీ కార్యాలయం పరిధిలో స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో అవకతవకలు జరిగిగాయనే సమాచారంతో డీఆర్‌డీఓ విచారణకు ఆదేశించారు.దీంతో శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో ఏపీడీ నూరుద్దీన్, స్త్రీనిధి మేనేజర్ రవీంద్రనాయక్ సిబ్బంది, గ్రామ దీపికలను విచారించారు. అలాగే, రికార్డులు పరిశీలించాక వారు మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని తెలిపారు. మండల వ్యాప్తంగా ఆడిట్ చేయించి సభ్యులకు న్యాయం చేస్తామని వెల్లడించారు.

### వితరణల వెల్లువ..

ఫొటో గ్రాఫర్ రాము కుటుంబానికి రూ. 1.65 లక్షలు ఆర్థిక సాయం..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఫొటో గ్రాఫర్ పసల రాము ఇటీవల మృతి చెందటంతో అతని కుటుంబానికి జిల్లా ఫొటో గ్రాఫర్లు రూ. 1.65 లక్షలను సాయం చేశారు. ఆ నగదును ఎమ్మెల్యే రాగమయి బాధితులకు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు వెంకట్, సెక్రటరీ కనకారావు, ట్రెజరర్ తిరుపతిరావు, రాఘవాచార్యులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

**టెన్త్ విద్యార్థులకు కుర్చీలు, ప్యాడ్లు..**



విద్యార్థులకు ప్యాడ్లు, కుర్చీలు అందిస్తున్న గ్రామస్తులు

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో గల జెడ్పీ హైస్కూల్‌లో పది చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం గ్రామస్తులు ప్యాడ్లు, కుర్చీలు వితరణగా అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం మధు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కల్లూరు: కల్లూరు పట్టణం మధిర రోడ్డులో నివాసముంటున్న ఇమ్మడిశెట్టి మురళీకృష్ణ (65) అప్పుల బాధ భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉదయం ఇంటి ముందు రేకుల షెడ్ పైకప్పుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కోటేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఏన్కూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని టీఎల్‌పేటలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీఎల్‌పేట ఇందిరా కాలనీలో నుంచి టాటా ఏసీ వాహనం అతి వేగంగా వస్తూ.. ఏన్కూరు నుంచి టీఎల్ పేట వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న టీఎల్ పేటకు చెందిన పసుపులేటి కృష్ణ (28) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు..**

సత్తుపల్లిటౌన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం సత్తుపల్లి మండలం కిష్టారంలో చోటు చేసుకుంది. ఏన్కూరుకు చెందిన ఎస్‌కె కరీష్మా, ఖమ్మంకు చెందిన ఎస్‌కె సైదాబి అక్కాచెల్లెళ్లు ఇద్దరు కలిసి సత్తుపల్లి రవాణాశాఖ కార్యాలయంలో ద్విచక్ర వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకొని తిరుగు ప్రయాణమవ్వగా.. కిష్టారం సమీపంలో వారికి ముందుగా వెళ్తున్న ద్విచక్రవాహనం వల్ల కళ్లలల్ల దుబ్బ పడటంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఎస్సై కవిత, కానిస్టేబుల్ లత గమనించి క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

**వ్యక్తికి గాయాలు..**

బోనకల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని రావినూతల – జానికీపురం గ్రామాల మధ్య శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే వైరాకు చెందిన కాశిమల్ల చార్లెస్ తన బైక్‌పై కోదాడ వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అటుగా వెళ్తున్న సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు పోలినేని సుదర్శన్ గమనించి 108కి సమాచారం అందించి మధిర ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.

### ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చింతకాని: మండలంలోని జగన్నాథపురం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. చిన్నమండవ మున్నేరు నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

### సాగునీరు పొదుపుగా వాడుకోవాలి

ఏన్కూరు/వైరారూరల్: రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని జలవనరుల శాఖ డీఈ కిషోర్, తహసీల్దార్ శేషగిరిరావు సూచించారు. శుక్రవారం మండలంలోని ఆరికాయలపాడు మేజర్ కాల్వ కింద పంట పొలాలను వారు పరిశీలించారు. అదే విధంగా వైరాలోని అష్టగుర్తిసాగర్‌కాలువ కింద వేసి మొక్కజొన్న పంటను తహసీల్దార్ శ్రీనివాసరావు , ఏఓ మయాన్ మంజుఖాన్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ నరసింహారావు, ఏఈ నవీన్‌కుమార్, ఏఈఓ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

### అత్యవసరమైతేనే బయటకు రావాలి

తల్లాడ: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. శుక్రవారం తల్లాడ పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ పుల్లయ్య, భద్రమ్మ, సురేష్, కళావతి, త్రివేణి, జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాలనీలో సమస్యలపై సర్వే..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఇందిరమ్మ కాలనీ వాసులు సమస్యలతో సతమతమవుతున్నారని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కాలనీలో సమస్యలపై సర్వే నిర్వహించారు. మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానాకై మార్చి 12 న వైరా మున్సిపాలిటీ ఎదుట నిర్వహించే మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నాగులుపాషా, గుడిమెట్ల మోహనరావు, నాగేశ్వరరావు, సతీష్, చారి, వెంకటేశ్వర్లు, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.